క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలో సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కుచులాపూర్, సుంకిడి, కొత్తూరు, తలమడుగు, బరంపూర్, దేవాపూర్, ఉండం, అర్లి, పల్సి, ఆదిలాబాద్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సాయిబాబా పల్లకి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశోక్, మాజీ సర్పంచ్ పోచన్న, వెంకటేశ్, అశోక్, ప్రమోద్, దశరథ్, విట్టల్, రామ్ కిషన్, వెంకన్న యాదవ్, పోచ్చన్న, పైడి నారాయణ, ప్రమోదు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక

సిరికొండ: జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బుర్ర సతీశ్ ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ సమక్షంలో మండలంలోని సిరికొండ గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఓరగంటి వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి వెంకటేశ్, కార్యదర్శులుగా ఓరగంటి ఉపేందర్, చందు, సాయికుమార్, శేఖర్, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంబ్లే బాలాజీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యేతో అయ్యప్పస్వాములు

బోథ్: సొనాల గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉదయం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: పాడి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేదపండితులు ఎల్కూచి శ్రావణ్ కుమార్ జోషి ఆధ్వర్యంలో నాయిడి శంకర్–మల్లేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మహాలక్ష్మి దేవికి మంగళహారతి ఇచ్చారు. డప్పువాయిద్యాలతో శోభాయాత్రగా వెళ్లి ఆలయంలో పూజలు చేశారు. ప్రతిఏడాది మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'హామీ నిలబెట్టుకోవాలి'



మాట్లాడుతున్న భరత్ చౌహాన్

ఉట్నూర్‌రూరల్: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. ఏళ్లుగా గిరిజనులతో పాటు గిరిజనేతరులు సైతం పంటలు సాగు చేసుకుటూ జీవనం కొనసాగిస్తున్నారని వారికి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి గిరిజన హక్కులను కాపాడాలని, ఏజెన్సీ ప్రాంతంలో 1970 సంవత్సర కంటే ముందు నుంచి కాస్తులో ఉన్న గిరిజనేతర రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట రైతులు శంకరయ్య, సత్తయ్య, బండి నర్సయ్య, సిద్దార్థ, సాయికుమార్, కొమురయ్య, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పశువుల అక్రమ రవాణా

- నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న అక్రమార్కులు
- పలుచోట్ల అడ్డుకున్న స్థానికులు
- కేసులు నమోదవుతున్నా ఆగని దందా
- ఇటీవల వరుస సంఘటనలు



వాహనంలో కుక్కిన పశువులు

కౌటాల: జిల్లాలో పశువుల అక్రమ రవాణా గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతోంది. వాహనాల్లో మూగజీవాలను కుక్కి ఇతర ప్రాంతాలకు ఇష్టారీతిలో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో చాలాచోట్ల స్థానికులు అక్రమ పశువుల రవాణాను అడ్డుకున్నా దందా మాత్రం ఆగడం లేదు. జిల్లాలోని పశువుల సంతల నుంచి, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి దళారులు ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిత్యం ప్రైవేట్ వాహనాల్లో మూగజీవాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వాహనాలపైన టార్పాలిన్ కవర్లు కప్పి పశువులను కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో మూగజీవాలను కుక్కి వందల కిలోమీటర్ల దూరం రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ఊపిరాడక మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నాయి.

కేసులు సరే.. అడ్డేది..?

జిల్లాలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దళారులు ఇష్టారీతిన లారీలు, వ్యాన్‌లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పశువుల అక్రమ రవాణా దందా కొనసాగుతోంది. పోలీసులు కేసులు నమోదు చేయడం, పశువులను గోశాలకు తరలించడం తప్ప శాశ్వతంగా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నట్లు పలు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గో సంరక్షణ చట్టం 1977 ప్రకారం.. పాలిచ్చే గోవులు, ఎద్దులు, దూడలు కబేళాలకు తరలించడం నిషేధం. ఏ గోవునైనా కబేళాలకు తరలించాలంటే మండల స్థాయిలో అనుమతి పత్రం తీసుకోవాలి. ఒక్క వాహనంలో రెండు పశువులకంటే ఎక్కువ రవాణా చేయకూడదు. వాహనంలో గాలి, వెలుతురు వచ్చే సదుపాయం ఉండాలి. పశువులకు నీరు, ఆహారం కల్పించాలి. గర్భంతో ఉన్న పశువులను ఎట్టి పరిస్థితుల్లో తరలించరాదు. కానీ ఈ నిబంధనలు జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పలు ఘటనలు..

- వాంకిడి మండల కేంద్రంలోని లంజన్వీర ఎక్స్ రోడ్డు వద్ద ఈ నెల 13న పోలీసులు తనిఖీ చేయగా.. బొలెరో వాహనంలో కుక్కి పశువులకు అక్రమంగా మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. ముగ్గురి పై కేసు నమోదు చేసి ఎనిమిది పశువులకు కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించారు.
- ఈ నెల 2న మహారాష్ట్ర నుంచి హైదరబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు కాగజ్‌నగర్ మండలం వంజీరి వద్ద పట్టుకున్నారు. అక్రమంగా పశువులు తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి 9 పశువులను గోశాలకు తరలించారు.

ఇష్టారీతిగా తరలింపు..

జిల్లాలో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి పశువుల అక్రమ రవాణా దందా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని వాంకిడి, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కౌటాల, జైనూర్ మండలాలు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు కావడంతో ఆయా మండలాల రహదారుల నుంచి పశువుల అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. జిల్లాలోని ఆయా ఏజెన్సీ ప్రాంతాల్లో చౌకగా లభించే పశువులను కొనుగోలు చేసి రాత్రి వేళల్లో పశువులను దొంగతనంగా కబేళాలకు తరలిస్తున్నారు. కాగా అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ఆయా సరిహద్దు మండలాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ వర్ధంతి



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్: ఉక్కు మనిషి సర్దార్ వలభాయ్ పటేల్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్, విశ్రాంత ఉద్యోగులు వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతినిధులు వెంకటేశ్వర్లు, అమలామేరి, మడిశెట్టి రాజేశ్వర్, కోమటిపెల్లి లింగయ్య, వసంత్, సునీత పాల్గొన్నారు.

పరామర్శ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు తల్లి దేవుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం స్థానిక ధోబి కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రయాణం.. ప్రమాదకరం



కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వెంకట్రావ్‌పేట వద్ద కోతకు గురైన కల్వర్టు

కౌటాల: కౌటాల –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వెంకట్రావ్‌పేట సమీపంలో కల్వర్టు కోతకు గురికావడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన వర్షాలకు సిర్పూర్(టి) మండలం పెద్దవాగు సమీపంలోని కల్వర్టు కోతకు గురైంది. దీంతో కొంత రోడ్డు కోతకు గురికాగా భారీ లోతులో గుంత ఏర్పడింది. ఈ రహదారిపై ప్రతీరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు గుంత గమనించకుండా వెళ్లి అదుపుతప్పితే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. కనీసం గుంత వద్ద హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి కోతకు గురైన కల్వర్టు వద్ద మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

బస్సు సేవలు ప్రారంభించరూ..?



- కొత్త రోడ్డు ఉన్నా.. బస్సు సౌకర్యం కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఆసిఫాబాద్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు (ఫైల్)

కెరమెరి: ఆదిలాబాద్ నుంచి అనార్‌పల్లి మీదుగా ఆసిఫాబాద్‌కు బస్సు సర్వీసులు ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఆదిలాబాద్ నుంచి వచ్చి ఉపాధ్యాయులు, ఉద్యోగులు సాథ్‌నాల, అర్జుని సైత్‌పూర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ రూట్‌లో బస్సు సౌకర్యం లేకపోవడంతో కొందరు ద్విచక్రవాహనాలపై వస్తుండగా, మరికొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కెరమెరి, ఆసిఫాబాద్, నార్నూర్, ఆదిలాబాద్‌లోని వివిధ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు సైతం అనేక అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని గతంలో అనార్‌పల్లి, దేవాపూర్, తుమ్మగూడ, బోరిలాల్‌గూడ తదితర గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్లను కలిసి వినతులు సమర్పించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

తగ్గనున్న దూరభారం..

ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వయా ఊట్నూర్ మీదుగా 130 కిలోమీటర్ల దూరం ఉంది. సాధనలా, ఉమ్రి మీదుగా ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తే 100 కిలోమీటర్ల దూరం పడుతుంది. ఈ లెక్కన ఈ మార్గంలో బస్సు ప్రారంభిస్తే 30 కిలో మీటర్లు తగ్గుతుండడంతో పాటు ఉమ్రి, లొకారి, మాలేపూర్, మలంగి, లక్మాపూర్, అనార్‌పల్లి, తుమ్మగూడ, దేవాపూర్ తదితర 30కిపైగా గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. ఇటీవల ఆయా గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కూడా కల్పించారు. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్‌ను వివరణ కోరగా రూట్ సర్వే చేశాక బస్సు ప్రారంభిస్తామన్నారు.

సౌకర్యంగా ఉంటుంది



ఆదిలాబాద్, ఆసిఫాబాద్ డిపోల నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. గతంలో డిపో మేనేజర్లను సంప్రదిస్తే బస్సు ప్రారంభిస్తామన్నప్పటికీ ఇంకా మోక్షం కలగలేదు. అధికారులు స్పందించి బస్సు ప్రారంభించాలి.

– రాథోడ్ శేశరావు, మాజీ సర్పంచ్, అనార్‌పల్లి

రాకపోకలకు ఇబ్బంది



బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నాం. బస్సు ప్రారంభిస్తారని చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాం.

– సీహెచ్ కల్యాణి, గొర్యాగూడ

బస్సు సేవలు ప్రారంభించాలి



కెరమెరి, అనార్‌పల్లి మీదుగా ఆదిలాబాద్ బస్సు ప్రారంభించాలి. బస్సు సేవలు లేకపోవడంతో ఉచిత బస్సు సదుపాయాన్ని పొందలేకపోతున్నాం. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– జాదవ్ అరుణ, అనార్‌పల్లి

వైద్యం అందక అవస్థలు

- రెండున్నరేళ్లుగా వైద్యాధికారి పోస్టు ఖాళీ
- ఆసుపత్రిలో వసతులు ఉన్నా సిబ్బంది కరువు



రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో మండలవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ల క్రితం ఏర్పడ్డ చింతలమానెపల్లి మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 30వేల జనాభా ఉంది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ సేవలపైనే ఆధారపడుతుంటారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గతంలో డిస్పెన్సరీగా ఉండేది. కాగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ 12గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చింది. నూతన భవనాన్ని అన్ని వసతులతో నిర్మించారు. కాని మొదటి నుంచి ఇక్కడ వైద్యుడి నియామకంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్యాధికారిగా ఇక్కడ పని చేసిన రుషి రెండున్నరేళ్ల క్రితం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇక్కడ రెగ్యులర్ వైద్యాధికారిని నియమించలేదు. డెప్యుటేషన్‌పై ఇక్కడ ఇన్‌చార్జిగా అజీముద్దీన్‌ను నియమించినా తిరిగి బదిలీపై వెళ్లారు. ఈ ఆరోగ్య కేంద్రంలో హెడ్ స్టాఫ్‌నర్స్ నాలుగు నెలల క్రితం బదిలీపై వెళ్లగా అప్పటి నుంచి ఖాళీగా ఉంది. డెప్యుటేషన్‌పై చింతలమానెపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో విధులు నిర్వహించే తహరీనా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ డాటా ఎంట్రీ ఆపరేటర్, పీహెచ్ఎన్ఎం, స్టాఫ్‌నర్స్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సేవలందక తిప్పలు..

చింతలమానెపల్లి మండలం కాగజ్‌నగర్ పట్టణానికి 50కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ క్రమంలో ఇక్కడి ప్రజలకు వైద్యసేవలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలే దిక్కు. పొరుగు మండలాలు కౌటాల, బెజ్జూర్ ఆరోగ్య కేంద్రాలలో సైతం వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆర్ఎంపీలను లేదా నాటు వైద్యాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు సరైన సమయంలో వైద్యం అందక పరిస్థితి విషమించిన ఘటనలు సైతం ఉన్నాయి. గుడ్లబోరి ఆరోగ్య ఉపకేంద్రంలో విధులు నిర్వహించే అధికారితో ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలందిస్తున్నారు. మరోవైపు ఉద్యోగ అవసరాలకు, ఇతర వైద్యాధికారి ధ్రువీకరణ పత్రాలకు స్థానికంగా అధికారి లేకపోవడంతో విద్యార్థులు, అభ్యర్థులు నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలో పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పూర్తిస్థాయి ఆరోగ్య కేంద్రం నిర్మించాలి



మండల కేంద్రంలో 24గంటలు వైద్యసేవలందించేలా ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలి. మండలంలోని ప్రజలు వైద్యం కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– చాప్లె సుధాకర్, గంగాపూర్

వైద్యాధికారిని నియమించాలి



రవీంద్రనగర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లేక ఇబ్బందులు పడుతున్నాం. వైద్య సలహాలు, వైద్యం అందక పోవడంతో ప్రైవేటు వైద్యంతో ఆర్థికంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి. రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలి.

– బుర్రి రూపేశ్, గూడెం

జంగుబాయి ఉత్సవాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సలాం శ్యాంరావు

కెరమెరి(ఆసిఫాబాద్): జనవరి 1 నుంచి నిర్వహించనున్న మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుష్య మాస ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు సలాం శ్యాంరావు అన్నారు. ఆదివారం జంగుబాయి ఆలయ ప్రాంగణంలో 8 గోత్రాల కటోడాలు, ఆదివాసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2 న దీపారాధన, 13న మహాపూజ, 28న శుద్ధి కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బాజీరావు, ప్రచార కార్యదర్శి బాపూరావు, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకుడు నగేశ్, సభ్యులు వెట్టి జాకు, కొడప జాకు, మల్కు పటేల్, మానిక్‌రావు, రాయిసిడాం జంగు, వెట్టి చందు, రామారావు, దౌలత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలో ఎంపికైన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన నలుగురు యువకులు భారత సైన్యంలో ఎంపికయ్యారు. వారిని గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. ఎంపికైన వారిలో తిత్రే జితేందర్, (సీఐఎస్ఎఫ్), బామన్ ధన్‌వీర్ (సీఐఎస్ఎఫ్), మహేశ్ (బీఎస్ఎఫ్), కటారే మేఘశ్యాం (సీఐఎస్ఎఫ్) ఎంపిక కాగా వారిని గ్రామస్తులు సన్మానించారు. ఈసందర్భంగా యువకులు మాట్లాడుతూ.. దేశ సేవ చేయడమే లక్ష్యంగా సైన్యంలో చేరామన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని యువత సైన్యంలో చేరడానికి ఆసక్తి కనబర్చాలని కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉట్నూర్‌రూరల్: గురువులతో పూర్వ విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్/ బేల: ఉట్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ పాఠశాలలో, బేల మండల కేంద్రంలోని తెలుగు మీడియం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2012– 13 బ్యాచ్‌కి చెందిన ఐదో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. చాలా రోజుల తరువాత కలుసుకోవడంతో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పినా.. గురువులను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.